

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యత
ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని 28, 29వ వార్డుల్లో మున్సిపల్ సాధారణ నిధులు సుమారు రూ.80 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయినేజీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పాలకొల్లు జెడ్‌పిటిసి నడపన గోవిందరాజునాయుడు, నేతలు చందక సత్తిబాబు, శీలం సూరిబాబు, డిటిడిసి బాబు, జోగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అరకొర జీతం.. అన్ని పథకాలూ దూరం..!

స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వం వివక్ష

పిఎఫ్, పెన్షన్, పిఆర్‌సి వర్తింపు వంటివేమీ లేకుండానే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటన

రెండు జిల్లాల్లో ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు విలవిల

రూ.పది వేలు వేతనం తీసుకుంటున్న ఆశాలకూ పథకాల్లో కోత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం. చిరుద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న మాటలు బూటకంగా మారిపోయాయి. ముఖ్యంగా అంగన్వాడీల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చాలీచాలని జీతాలు ఇస్తూ.. ప్రభుత్వ పథకాలు అందించకుండా నిలిపివేయడంతో జిల్లాలో ఏడు వేల మందికిపైగా అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా మారింది. రూ.పది వేలు జీతం అందుకుంటున్న ఆశా వర్కర్లలోనూ చాలామందికి ప్రభుత్వ పథకాలు అందని దుస్థితి నెలకొంది.



అంగన్వాడీ ఉద్యోగులకు రూ.11 వేలు జీతం ఇస్తూ ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఇదే ఇబ్బందిగా మారే పరిస్థితి కన్పిస్తోంది. రెండు జిల్లాల్లో 7,372 మంది వరకూ అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు రూ.11 వేలు, ఆయాలకు రూ.ఏడు వేల చొప్పున ప్రతినెలా జీతం ఇస్తోంది. వీరంతా స్కీమ్ వర్కర్లు. ప్రభుత్వం మాత్రం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులని చెబుతూ ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేసింది. అంగన్వాడీ కుటుంబాల్లో వృద్ధులకు పెన్షన్‌గాని, కొత్త రేషన్‌కార్డులుగాని, అమ్మఒడి, ఇంటి స్థలాలు, చేయూత, పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఏఒక్క ప్రభుత్వ పథకం అమలు కావడం లేదు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా తిరస్కరిస్తున్న పరిస్థితి ఉంది. పెరిగిన ధరల ప్రకారం చూస్తే అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చే జీతం రూ.11 వేలు నెలలో సగం రోజులకు కూడా సరిపోని పరిస్థితి. మిగిలిన కుటుంబ సభ్యులు పనికెళ్తేనే కుటుంబం ముందుకు సాగే పరిస్థితి. అలాంటి చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా తయారైంది. అంగన్వాడీలకు పిఎఫ్‌గాని, పెన్షన్, పిఆర్‌సి వర్తింపు వంటి ఏఒక్క సౌకర్యమూ ప్రభుత్వం ఇవ్వడం లేదు. అయితే ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడం విస్మయపరుస్తోంది. రూ.50 వేలకుపైగా జీతం తీసుకుంటున్న ఉద్యోగుల తరహాలో అంగన్వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సైతం నిలిపివేయడంతో అంగన్వాడీ ఉద్యోగులు తమ పిల్లలను చదివించుకోలేని దుస్థితి నెలకొంది. ఉద్యోగ విరమణ పొందినా జాబితా నుంచి పేరు తొలగించకపోవడంతో వృద్ధాప్య పెన్షన్ సైతం అందుకోలేని దుస్థితిని ప్రభుత్వం సృష్టించింది. అంగన్వాడీలకు కనీస వేతన చట్టం సైతం వర్తింపజేయని ప్రభుత్వం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా ఏవిధంగా చెబుతుందో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల సంఖ్య తగ్గించుకోవడం కోసం ఈ విధంగా చిరుద్యోగులైన అంగన్వాడీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.పది వేలు ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు ఆదాయం కలిగిన వారికి పథకాలు వర్తించవని ప్రభుత్వం చెబుతోంది. మరి పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీలకు రూ.11 వేలు జీతమే అందుకుంటున్నా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదు. ప్రభుత్వం చెబుతున్న మాటలు బూటకమని క్షేత్రస్థాయి పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి.

ఆశా వర్కర్లకూ ప్రభుత్వ పథకాల కోత

రెండు జిల్లాల్లో మూడు వేల మంది వరకూ ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం రూ.3,760, రాష్ట్రప్రభుత్వం 7,200 మొత్తం రూ.పది వేల వరకూ వేతనంగా వస్తోంది. పది వేలు జీతం తీసుకుంటున్నారనే కారణంతో ఆశా వర్కర్లకు సైతం ప్రభుత్వ పథకాలు ఆపేస్తున్న పరిస్థితి ఉంది. గతంలో పథకాలు అందుకుంటున్న వర్కర్లకు మాత్రమే కొనసాగుతున్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకుంటే మాత్రం ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఆశా వర్కర్లలో సగం మందికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని తెలుస్తోంది. అంగన్వాడీ, ఆశాలు వంటి చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఇదే వైసిపికి పెద్ద ఎదురుదెబ్బ కానుందనే చర్చ రాజకీయంగా నడుస్తోంది.

అభివృద్ధి పనులు బాధ్యతతో చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

పాఠశాల అభివృద్ధి పనులను బాధ్యతతో చేపట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను, అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను పరిశీలించి ఇప్పటి వరకు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. మిగిలిన పనులు శ్రద్ధ పెట్టి పూర్తి చేయించాలన్నారు. మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. వారంలో రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు విజిట్ చేసి క్వాలిటీ చెక్ చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ వారంలో రెండు రోజులు విధిగా పాఠశాలల తనిఖీకి వెళ్లాలని, తనిఖీ వివరాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కోపల్లె అంగన్వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్, స్టాకును ఆమె పరిశీలించారు. కోడి గుడ్డు సైజు స్వయంగా పరిశీలించి నిర్ణీత బరువు ఉన్నదీ లేనిదీ తూకం వేయించారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ల నాణ్యత పరిశీలించారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. చిన్నారులకు కొన్ని ప్రశ్నలు వేసి ఆమె సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




దీక్షలనుద్దేశించి కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

కాలుష్యకారక చెరువులపై చర్యలు తీసుకోవాలి

వీరవాసరం మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో తాగునీరు కలుషితానికి కారణమవుతున్న ఆక్వా చెరువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశం కోరింది. వీరవాసరం మండల పరిషత్ సమావేశం ఎంపిడిఒ జ్యోతి ఆధ్వర్యంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన శనివారం జరిగింది. వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు గైర్హాజరయ్యారు. టిడిపి, జనసేన ఎంపిటిసిలతో జరిగిన సమావేశంలో శాఖలవారీ సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఎంపిటిసిలు గుర్తించిన సమస్యలను పరిష్కరించడంపై సర్పంచులు పట్టించుకోవడం లేదని సమావేశంలో పలువురు వాపోయారు. నవుడూరు, నందమూరుగరువు గ్రామాల్లో పది రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఏర్పాడ్డాయని ఆ గ్రామాల ఎంపిటిసిలు యాళ్లబండి ఇందిర, వాసాల వెంకటేశ్వరరావు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కనకారావు దృష్టికి తీసుకొచ్చారు. నవుడూరులో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి అక్కడ సర్పంచి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, నా అభిప్రాయానికి ప్రాధన్యం ఇవ్వరా అంటూ ఎంపిటిసి ఇందిర ప్రశ్నించారు. చింతలకోటిగరువులో బోరు వాటర్‌లో ఐరన్ శాతం అధికంగా ఉంటుందని, దానిని పరిష్కరించాలని కోరినా అక్కడ సర్పంచి, కార్యదర్శి పట్టించుకోవడం లేదని, అధికారులైనా పట్టించుకోవాలని ఎంపిటిసి కొల్లేపర శ్రీనివాసరావు కోరారు. రాయకుదురు నుండి పాముకాటుకు గురైన వ్యక్తిని వీరవాసరం పిహెచ్‌సికి తీసుకొస్తే వైద్యం చేయకుండా పాలకొల్లు పంపారని ఎంపిటిసి నెప్రూ వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటిదేమీ జరగలేదని వైద్యాధికారి చెప్పగా విచారించి వాస్తవాలు తెలుసుకోవాలని ఎంపిపి దుర్గాభవాని వైద్యాధికారికి సూచించారు. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నా ఎఎన్ఎంల సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, వృద్ధులు ఏ విధంగా ఉన్నారో ఆరా తీసిన దాఖలాల్లేవని ఎంపిటిసి విజయలక్ష్మి ఆరోపించారు. వైసిపి పాలనలో అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొందని ఎంపిటిసిలు నెప్రూ, అడ్డాల రాము, అంగర కుటుంబరావు వ్యాఖ్యానించగా చేసిన పనులు పూర్తయిన వెంటనే ఎంబుక్‌లో నమోదు చేయాలని జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరావును కోరారు. కొంతమంది కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు వేశాక తర్వాత వాటి అంచుల వెంబడి కంకర వేస్తేనే ఎంబుక్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగడం లేదని, కరెంటు కోతలు ఎక్కువగా ఉంటున్నాయని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, రొయ్యల సాగు రైతులకు గిట్టుబాటు ధర అందడం లేదని పలువురు ఎంపిటిసిలు, తోలేరు సర్పంచి వేండ్ర లీలాకృష్ణ ప్రస్తావించారు. సమావేశంలో తహశీల్దార్ సుందరరాజు, ఆర్అండ్‌బి ఎఇ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గంగాభవాని

కొనసాగిన నిరసన దీక్షలు

సంఘీభావం తెలిపిన కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడలో గోదావరి పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారమూ కొనసాగాయి. ఈ దీక్షలకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ న్యాయమైన సమస్యపై పోలీసు నిర్బంధాన్ని, దాడులను తట్టుకుని అలుపెరగని పోరాటం చేస్తున్న చించినాడలోని దళిత, బలహీన వర్గాల ప్రజల ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఇప్పటికే అనేక ప్రజా సంఘాలు, పార్టీలు చించినాడ ప్రజలకు సంఘీభావం తెలిపారని, పేదలందరికీ న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే జగనన్న ఆణిముత్యాలు

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - భీమవరం రూరల్



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి, కలెక్టర్

విద్యార్థుల్లో మరింత స్ఫూర్తిని నింపేందుకే జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖా మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి కార్యక్రమం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి కారుమూరి వెంకట నాగేశ్వరావురావు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. మంత్రి కారుమూరి మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు పట్ల పోటీతత్వం పెంచి మరింతగా చదువుకునేలా ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రోత్సాహకాలను అందజేస్తున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించినప్పుడే విద్యార్థులు ప్రయోజకులవుతారన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. గత ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురికి, మార్చిలో ఇంటర్ పరీక్షల్లో టాప్ వన్ విద్యార్థికి పారితోషికం అందజేశారు. ఆరుగురు ఇంటర్ విద్యార్థులు, 12 మంది పదో తరగతి విద్యార్థులు నగదు పురస్కారం, మెమెంటోలను అందుకున్నారు. కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, ఆర్ఐఒ చంద్రశేఖర్‌రావు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహారాజు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, వైసిపి నేత గూడూరి ఉమాబాల, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అత్తిలి: విద్యార్థుల శ్రేయస్సు కోసం, వారి విద్యా ప్రమాణాల మెరుగు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న వ్యక్తి సిఎం జగన్ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం కొమ్మర, అత్తిలి హైస్కూళ్లలో విద్యార్థులకు విద్యాకానుక సామగ్రిని ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ కొమ్మర హైస్కూల్‌లో 250 మంది విద్యార్థులకు, అత్తిలి బాలుర, బాలికల యూపి స్కూల్‌లో 750 మంది విద్యార్థులకు విద్యా కానుక అందించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఎంపిపి మక్కా సూర్యనారాయణ, జెడ్‌పిటిసి అడ్డాల జానకి, వైసిపి నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యంరాజు మృతదేహం

మరో గంటలో ఇంటికి చేరతారనుకుంటే..!

వియత్నాం యాత్ర ముగింపులో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వారంతా మంచి స్నేహితులు. 10 రోజులు విహారానికి వియత్నాం, కాంబోడియా దేశాలకు వెళ్లారు. యాత్ర ముగించుకుని మరో గంటలో ఇంటికి చేరాల్సి ఉండగా చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, మరో ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. దీంతో పాలకొల్లు పట్టణం, పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున టాటామేజిక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కారు నడుపుతున్న పాలకొల్లు మండలం వెంకటాపురానికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు (55) అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ప్రమాదంలో అదే కారులో ప్రయాణిస్తున్న పాలకొల్లు పట్టణానికి చెందిన మరో ముగ్గురు గాయాల పాలై రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా టాటా మేజిక్‌లో ఉన్న ముగ్గురు మృత్యువాతపడ్డారు. పాలకొల్లు నుంచి 12 మంది స్నేహితులు ఈ నెల 7న బయల్దేరి వియత్నాం, కాంబోడియా దేశాలకు విహారయాత్రకు వెళ్లారు. వారంతా యాత్ర ముగించుకుని విశాఖపట్నం చేరుకున్నారు. అక్కడ నుంచి ఎనిమిది మంది ట్రావెల్స్ బస్సులో పాలకొల్లు బయల్దేరగా మరో నలుగురు కారులో బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో టాటా మేజిక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సుబ్రహ్మణ్యరాజు అక్కడికక్కడే మృతి చెందారు.

బస్సులో వెళ్లొచ్చి ఉంటే..!

ఈ నెల 7న స్నేహితులంతా విశాఖపట్నం వెళ్లేందుకు, తర్వాత యాత్ర ముగిసిన అనంతరం పాలకొల్లు తిరిగొచ్చేందుకు ముందుగానే ట్రావెల్స్ బస్సు మాట్లాడుకున్నారు. అయితే మృతుడు సుబ్రహ్మణ్యంరాజు తన కారును మరమ్మతు నిమిత్తం వచ్చేటప్పుడు రాజమండ్రిలో ఇస్తానంటూ కారులో వైజాగ్ బయల్దేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలోనూ కారులోనే బయల్దేరగా రాజమండ్రి వరకూ డ్రైవర్ కారు నడిపాడు. నిద్రమత్తు రీత్యా టీ తాగాక సుబ్రహ్మణ్యరాజు తాను కారు నడుపుతానని డ్రైవింగ్ ప్రారంభించాడు. రాజుతోపాటు మరో ముగ్గురు కారులోనే బయల్దేరగా ఎనిమిది మంది ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ట్రావెల్ బస్సులో బయల్దేరారు. అయితే ఆలమూరు వద్ద ప్రమాదం చోటుచేసుకోవడం, సుబ్రహ్మణ్యంరాజు మృతి చెందడం, మిగిలిన ముగ్గురు మిత్రులు సైతం గాయాల పాలవ్వడంతో బస్సులో ఉన్న మిత్రులకు సమాచారం అందలేదు. ప్రమాద స్థలి పక్కనుంచే మిత్రుల బస్సు ప్రయాణించి పాలకొల్లు చేరింది. బస్సు పాలకొల్లు చేరాక వీరికి ప్రమాదం గురించి తెలియడంతో వారంతా హుటాహుటీన ప్రమాదస్థలికి, మిత్రులు చికిత్స పొందుతున్న రాజమండ్రి ఆసుపత్రికి బయల్దేరి వెళ్లారు. సుబ్రహ్మణ్యంరాజు మృతదేహానికి మండపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఎంఎల్‌ఎ నిమ్మల పరామర్శ

ప్రమాదం విషయం తెలియగానే పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు హుటాహుటీన ప్రమాద స్థలానికి చేరి సహాయక చర్యలు పర్యవేక్షించారు. అనంతరం రాజమండ్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ప్రమాదం పట్ల మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు అభినందనీయం

ఎపి నిట్ రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. చౌదరి స్పిన్నర్స్ చివటం (తణుకు) వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న నార్త్, సౌత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది (2022-23) ఎపి నిట్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న తొమ్మిది మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.2.25 లక్షలు విలువైన చెక్కులను శనివారం రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి తన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్య అభ్యసించేలా కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేయడం శుభపరిణామమని వివరించారు. ట్రస్ట్ ఫౌండర్ చిట్టూరి ప్రసాద్‌చౌదరి మాట్లాడుతూ నార్త్, సౌత్ ఫౌండేషన్‌ను 2011లో ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూతనందిస్తున్నామన్నారు. ఈ ఏడాది మొదటి విడతగా రూ 21.73 లక్షలను 94 మంది పేద విద్యార్థులకు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్, అడ్మిషన్ల అధికారి డాక్టర్ పి.తపస్ పాల్గొన్నారు.

రక్త దాతలు స్ఫూర్తి ప్రదాతలు : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను స్థానిక కలెక్టరేట్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రక్తదానంపై ఎన్నో అపోహలున్నాయని, రక్తదానం వల్ల ఎటువంటి నష్టమూ లేదని స్పష్టం చేశారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎన్నిసార్లైనా రక్తాన్ని దానంగా ఇవ్వొచ్చన్నారు. కొంతమంది తరచూ రక్తదానం చేస్తూ ఉంటారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. నూటికి 25 శాతం మాత్రమే రక్తం అందుబాటులో ఉందని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 130 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, ఈ ఏడాది సుమారు 2,500 మంది రక్తదానం చేశారని తెలిపారు. రక్తదానం చేసిన సంస్థలకు చెందిన 37 మందిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శివరామ బద్రిరాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ భానునాయక్, డిఐఒ దేవ సుధ, రక్త దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాదుడే.. బాదుడు..!

ప్రభుత్వ అసంబద్ధ, చట్టవ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజలపై పోలీసులను ఉసిగొల్పి నిర్బంధకాండ ప్రయోగించి, ఆపై లాఠీలతో బాదేస్తుండగా.. ప్రభుత్వం నేరుగా ఛార్జీల మోతతో పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులు పెడుతోంది..

పోలవరం పనుల్లో నాణ్యతాలోపంపై వార్తలు వెలువడటంతో ఆ పనుల పరిశీలనకు బయల్దేరిన టిడిపి నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని నిర్బంధించారు. మాజీ మంత్రులు దేవినేని ఉమ, జవహర్‌ను బుట్టాయగూడెం పోలీసు స్టేషన్‌లో నిర్బంధించగా పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తదితరులను వివిధ చోట్లకు తిప్పి, వాహనాలు మార్చి చివరకు స్వగృహానికి చేర్చారు. ఇప్పటికే సిఎం పర్యటనల సందర్భంలోనూ మీడియాను సైతం ఒకచోట ఉంచి ఫొటోలిస్తాం.. వివరాలిస్తాం కవరేజీ ఇవ్వండి అంటూ ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రదర్శిస్తోంది. సిఎం భద్రతరీత్యా అని సరిపెట్టుకుందామంటే సాధారణ రోజుల్లోనూ ప్రాజెక్టు పనుల పరిశీలనకు ముందస్తు అనుమతి లేకపోతే మీడియాను సైతం అనుమతించడం లేదు. ఏదోవిధంగా వెళ్లినా ఇతర దేశాల్లోకి వెళ్లినట్లుగా నిరంతరం ఎవరోకరు అనుసరిస్తూ అటు వెళ్లొద్దని, ఇటు వెళ్లొద్దని ఆంక్షలు విధిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పనుల్లో నాణ్యతాలోపంపై పరిశీలనకు బయల్దేరిన టిడిపి నేతలను అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. అనుమతి తీసుకోకపోవడం వల్లే అడ్డుకున్నామని పోలీసు అధికారులు ప్రకటించారు. వాస్తవంగా అనుమతి కోరితే ఈ అధికారులు ఇస్తారా అనేది అనుమానమే. పనుల్లో నాణ్యతా లోపాలేమీ లేవని అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు అధికారులు సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. అదే నిజమైతే టిడిపి నేతలను ఎందుకు పనుల పరిశీలనకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారనే దానికి ఏఒక్కరి వద్దా సమాధానం లేదు.

అయితే ఇక్కడ కూడా టిడిపి గతంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించినట్లే ఇప్పుడూ పనులపైనే దృష్టి పెట్టి పోరాటాలకు సిద్ధమవుతుంది తప్ప ప్రాజెక్టులో జల సమాధి అవుతున్న నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం, ప్యాకేజీ, పునరావాసం గురించి టిడిపి ప్రభుత్వ హయాంలో పట్టించుకున్న దాఖలాల్లేవు. పైగా బలవంతంగా కొన్ని గ్రామాలను ఖాళీ చేయించిన పరిస్థితి ఉంది. అయితే తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం సైతం అదే ధోరణి ప్రదర్శిస్తోంది. పైకి సానుభూతి మాటలు చెబుతున్నా కార్యాచరణలో సాయం అందించకపోగా వరద బారిన వదిలేసి 'పొమ్మనలేక పొగబెట్టిన' చందంగా వ్యవహరిస్తోంది.

చించినాడలో గోదావరి పెరుగులంక భూముల వ్యవహారంలోనూ ప్రభుత్వం తీరు అత్యంత జుగుప్సాకరంగా మారింది. 'నవ్విపోదురు నాకేటీ సిగ్గు' అనే చందంగా ప్రభుత్వ పరువు బజారున పడుతున్నా మట్టి తవ్వకాల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. జిల్లా అధికారులు సైతం ప్రజాప్రతినిధుల ఒత్తిడో.. అధికారం అండగా ఉందనో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసుల రక్షణ నడుమ అక్రమ దందా సాగించడం వైసిపి పాలకులకే చెల్లిందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. రాజకీయంగా ఎదుగుదలలో ఎవరి సలహాలు తీసుకున్నామో.. ఎవరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగామో అనేది మరిచారో ఏమో సదరు అధికార పక్ష ప్రజాప్రతినిధులు కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలు వారి అహంకారపూరిత వైఖరికి నిదర్శనంగాను, అవగాహనారాహిత్యానికి ప్రతిబింబంగానూ ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దిగువస్థాయి నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికైనా ప్రజల పక్షంగా లేకపోతే 'రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలే' అనే పరిశీలకుల వ్యాఖ్యానం రానున్న రోజుల్లో అధికారపక్షానికి తప్పదని అంతా చెబుతున్నారు. చలో చించినాడ పేరిట నిర్వహించిన సభకు సైతం పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. ఆపై భూముల పరిశీలనకు బయల్దేరిన నేతలను ప్రధానంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాసంఘాల నేతలను ఈడ్చుకుంటూ లాక్కెళ్లి వ్యాన్‌ల్లోకి ఎక్కించిన తీరు ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా లేదా అనే అనుమానం కల్గించింది. నేతలను తరలిస్తున్న వాహనాన్ని ఎక్కడికక్కడ సిపిఎం, టిడిపి శ్రేణులు అడ్డుకోవడంతో పోలీసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆచంట, మార్టేరు, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం తీసుకొచ్చి విడిచిపెట్టారు. ప్రభుత్వ విధానాలు, పోలీసులు దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్డెక్కిన తీరు ఇప్పటికైనా పాలకులు తన పంతం వీడి మట్టి తవ్వకాలను ఆపాలని చెప్పకనే చెబుతోంది.

ఇక ప్రభుత్వం నేరుగా పేదలపై బాదుడుకు తెగబడింది. విద్యుత్ ఛార్జీల మోత, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు భారాలను గుట్టుచప్పుడు కాకుండా ప్రజలపై మోపుతోంది. విద్యుత్ తీగను తాకితే కొట్టే షాక్ ఇక బిల్లును ముట్టుకుంటేనే కొడుతోందని ఈ నెల విద్యుత్ బిల్లులు అందుకున్న వినియోగదారులంతా లబోదిబోమంటున్నారు. ఎన్నికల వేళ కచ్చితంగా ప్రభుత్వం తీరు మారకపోతే జిల్లావాసులు అధికారపక్షానికి షాక్ ఇవ్వడం ఖాయమని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

సబ్‌జైలులో జైల్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సబ్ జైలును ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ శనివారం సందర్శించి జైలు అదాలత్ నిర్వహించారు. ఆయన నిందితులతో మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేని నిందితులకు సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిందితులకు అందుతున్న భోజనం వివరాలను, వారికి ఇస్తున్న సదుపాయాలు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. న్యాయమూర్తితో పాటు ఉచిత న్యాయవాది కె.శిరీష, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, పారా లీగల్ వాలంటీర్ డి.వరలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి

కౌలు రైతుకు గుర్తింపు కార్డు అవసరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు చాలా అవసరమని జుత్తిగ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి అన్నారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులపై మార్టేరు 1, 2, నెగ్గిపూడి, వెలగలేరు గ్రామాల్లో టీం లీడర్‌గా ఎఒ ఎ.జ్యోషిల, సోమరాజు, ఇల్లింద్రపర్రు, జుత్తిగ, మల్లిపూడి, నత్తా రామేశ్వరం గ్రామ సభలకు టీంలీడర్‌గా తహశీల్దార్ దండు అశోక్‌వర్మ ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని మొదటిరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ దండు అశోక్‌వర్మ మాట్లాడుతూ మండలంలో మొత్తం 2910 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు అయ్యాయని, త్వరలోనే అందరికీ అందిస్తామని తెలిపారు. ఈ నెల 20వ తేదీన ఆలమూరు, ఓడూరు, నెలమూరు, మాముడూరు, పొలమూరు 1, 2, ఈ నెల 21వ తేదీన సత్యవరం, భట్లమాగుటూరు, వివి.పాలెం, పెనుమంట్ర 1, 2 లతో గ్రామ సభలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, విఆర్‌ఒలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌ను కలిసిన వేణు

ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌ను కలిసిన వేణు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొవ్వూరి వేణు మాధవ్‌రెడ్డి శనివారం పాలకొల్లు వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మేడపాటి చంద్రమౌళిరెడ్డి, పోడూరు ఎంపిపి సుమంగళి, నంబూరి గంగాపవన్, పొత్తూరి రంగరాజు, జోగి వెంకటేశ్వరరావు, గేదెల నరసింహారావు, కొండేటి రవి, వీర్రెడ్డి ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 36 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో హెటిరో లాబొరేటరీస్ వారిచే బిఎస్‌సి, ఎంఎస్‌సి విద్యార్థులకు కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 65 మంది హాజరు కాగా 36 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో 14 మంది ఛాంబర్స్ కళాశాల విద్యార్థులని తెలిపారు. వీరికి నెలకు రూ.24 వేల జీతం ఉంటుందని పిఎఫ్, గ్రాడ్యువిటీ, ఇఎస్‌ఐ, వైద్య సదుపాయం, వార్షిక బోనస్ సౌకర్యాలు ఉంటాయని హెటిరో లాబరేటరీస్ హెచ్‌ఆర్ మేనేజర్ శీలంశెట్టి వంశీ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు, కార్యదర్శి కలిదిండి రామరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు అభినందించారు.


నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

నాడు-నేడులో చేపట్టిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు-నేడు ఫేజ్-2లో 46 పాఠశాలలు, పది అంగన్‌వాడీ కేంద్రాలను రూ.17.85 కోట్లతో, అభివృద్ధి పరుస్తున్నామన్నారు. అనంతరం మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు, పిఆర్‌ఎస్‌ఇ అశోక్, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర ఉన్నారు.

వైఎస్ఆర్ పశు బీమాను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

వైఎస్ఆర్ పశుబీమా పథకం పాడి రైతులకు వరమని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు నెహ్రుబాబు అన్నారు. పిప్పర పశువైద్యశాలలో పశు బీమా పథకంపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాడి రైతుల కోసం, గొర్రెల, మేకల పెంపకదారుల కోసం ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు రామచంద్రరావు, సహాయ సంచాలకులు నాయక్, పిప్పర పశువైద్యులు నాగజ్యోతి పాల్గొన్నారు.

19 నుంచి డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు

గణపవరం :గణపవరం డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియకకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. 24వరకు మేజర్, మైనర్ సబ్జెక్టుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. వివరాలకు 7901056668 సంప్రదించాలని తెలిపారు.

'నాపై ఆరోపణలు అవాస్తవాలు'

మొగల్తూరు : తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని వైసిపి నాయకుడు పోతుల రమేష్ అన్నారు. మొగల్తూరులో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరుపాలెం సౌత్ బికె మెరకకు చెందిన విఒఎ మద్దాల సూర్యకుమారి తనపై చేసిన ఆరోపణలు అవాస్తవాలన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు తన ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

రుణాల వసూళ్లలో కలవపూడి సొసైటీ ముందంజ


కలవపూడి సొసైటీ

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు తీర ప్రాంత ప్రజలకు చేయూతనిస్తూ.. రైతులను అన్ని విధాలుగా ఆదుకుని కలవపూడి సొసైటీ లాభాల బాటలో నడుస్తోంది. గత 13 ఏళ్లుగా ప్రజలకు, రైతులకు ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలు చేసి సెంట్రల్ బ్యాంక్ నుంచి జిల్లా ఉత్తమ సహకార సంఘంగా ముందంజలో ఉంటూ... అవార్డులు పొందుతూ మిగతా సొసైటీలకు ఆదర్శంగా నిలిచింది. ఉప్పుటేరు తీర ప్రాంతంలో కలవపూడి గ్రామంలో సొసైటీ 1956లో 9 మంది సభ్యులతో ప్రారంభమై నేడు 2545 మంది సభ్యులతో ఉంది. ప్రారంభంలో రూ.15 షేర్ ధనంతో సొసైటీ ఏర్పడింది. ప్రస్తుతం రూ.64.50 లక్షల షేర్ ధనం కలిగి ఉంది.

క్రమశిక్షణతో సొసైటీ నిర్వహణ

బ్యాంకు వ్యవస్థాపకుల స్ఫూర్తి అడుగడుగునా మూర్తీభవిస్తూ బాధ్యతాయుతంగా క్రమశిక్షణగా సొసైటీ అధ్యక్షుల, సిబ్బంది కృషి ఉంది. రైతులకు అన్నివిధాలా రుణాలు మంజూరు చేస్తూ వారికి ఆపన్నహస్తం అందించి వారిచే సిరుల పంటలు పండించేందుకు సొసైటీ తోడ్పడుతోంది. ప్రస్తుతం సొసైటీ ప్రగతి బాటలో పురోగమిస్తూ ప్రజాసేవలో తరిస్తోంది.

వార్షిక టర్నోవర్ రూ.10 కోట్లు

సహకార బ్యాంకులో వార్షిక టర్నోవర్ రూ.పది కోట్ల వ్యాపారం నడుస్తోంది. పంట రుణాలు, బంగారు ఆభరణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తూ రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని ముందుకు నడిపిస్తున్నారు. ప్రాతళ్లమెరక, పల్లిపాలెం, ఎస్‌సి బోస్ కాలనీ, మాలవానితిప్ప, గోగుతిప్ప, ఇసుకలంక, కలవపూడి, మోడీ గ్రామాల రైతులకు, ప్రజలకు సేవలందిస్తోంది. 2022-23 సంవత్సరంలో సంఘ సభ్యులకు, రైతులకు, వివిధ రకాల రుణాలు రూ.6.44 లక్షల రుణాలు అందించారు. సంఘ పరిధిలో ఉన్న ప్రాతళ్లమెరక, పల్లిపాలెం, ఎస్‌సి బోస్ కాలనీ, మాలవాని తిప్ప, ఇసుకలంక, కలవపూడి, గోగుతిప్ప, మోడీ పరిధిలో ఉన్న రైతులకు, ప్రజలకు రుణాలు సొసైటీ అందిస్తోంది. 2022- 2023 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి రూ.6.44 కోట్లు నూరు శాతం వసూలు చేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ రిపోర్ట్ పూర్తి చేసిన జిల్లాలోని మొదటి సంఘంగా ఉంది.

రూ.38 లక్షల నికర లాభం

రామవెంకటసత్యనరసింహారాజు(మణి), సొసైటీ సిఇఒ



సొసైటీలో జాతీయ బ్యాంకులకు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్, బ్యాంకు రుణాల అందజేత, లాకర్ సదుపాయాలు ఉన్నాయి. అధ్యక్షులు, సిబ్బంది కృషి, సభ్యుల సహకారంతో ఇచ్చిన అప్పులు నూటికి నూరు శాతం బకాయిలు వసూలు చేసిన జిల్లాలోని మొదటి సంఘంగా నిలిచింది. సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. 2022-23లో రూ.38 లక్షల నికర లాభం వచ్చింది. డివిడెండ్ రూపంలో పంపిణీ చేస్తాం.

రైతుల సంక్షేమమే లక్ష్యం

పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, త్రిసభ్య కమిటీ ఛైర్మన్



రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. ఆక్వా రైతులకు జగన్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ కల్పించింది. ఈ ప్రాంతంలో నూరుశాతం ఆక్వా రంగం ఉంది. ఉప్పుటేరు తీర ప్రాంత ప్రజలకు, రైతులకు ఈ సొసైటీ ద్వారా అన్ని రకాల రుణాలు అందిస్తున్నాం. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు కలవపూడి సొసైటీకి ప్రత్యేక శ్రద్ధతో సహకారం అందిస్తున్నారు.

ఘన జీవామృతంతో అధిక మేలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రకృతి సహజ సిద్ధమైన ఘన జీవామృతం ఎరువు తయారీతో రైతులకు, పెరటి పంట రైతులకు ఎంతో ఉపయోగకరమైన మేలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా కో-ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. కుమ్ముదపల్లి గ్రామంలో రైతులకు శనివారం సహజ సిద్ధమైన గోవుల నుంచి వచ్చే మూత్రం, పేడ, బెల్లం, పుట్ట మట్టి, శెనగపిండితో ఘన జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఘన జీవామృతం ఎరువు తయారు చేసిన తర్వాత ఆ ఎరువును పంట పొలాల్లో, ఇంటి ఆవరణలో ఉన్న పెరటి మొక్కల మధ్య వేసుకోవడం ద్వారా ఎన్నో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు తయారై అధిక ఉత్పత్తులను పెంచేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరేంద్ర, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

వ్యకాస మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉండి

త్వరలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఐ ఉండి కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు సనపల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 24 నుంచి 26 వరకు బాపట్లలో జరుగుతున్నాయని తెలిపారు. బికెఎంయు రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ జిల్లా మహాసభ జూలై 24వ తేదీన ఉండిలో జరపాలని జిల్లా సమావేశం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.


అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - పోడూరు

చిన్నారుల భవితకు భరోసా ఇచ్చేలా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యావిధానం జరుగుతోందని పాలకొల్లు ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్.ఇందిర అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం జిన్నూరు ఎన్ఆర్.పేట హబ్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు సిడిపిఒ ఇందిర, సర్పంచి జమ్ము బేబిమహాలక్ష్మి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎసిడిపిఒ నాగరత్నం, సూపర్‌వైజర్ జి.హేమ తులసి, ఎంఎస్‌కె.అంజలి, వార్డు సభ్యురాలు పితాని కనకదుర్గ, అంగన్‌వాడీ టీచర్లు రావూరి సూర్యకుమారి, బి.లక్ష్మిబాయి, ఎ.సునీత, ఎల్.ఉషారాణి, ఎ.లక్ష్మిప్రభ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించడం అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు


సర్పంచి శ్రీనివాస్, విద్యుత్ శాఖాధికారులను సత్కరిస్తున్న గ్రామస్తులు

గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి సర్పంచి బి.శ్రీనివాస్ అందించిన సహకారం అభినందనీయమని విస్సాకోడేరు గ్రామస్తులు కొనియాడారు. గ్రామంలో ఇటీవల కాలంలో 163 కెవి, 100 కెవి, 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు మరో రెండు 40 కెవి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సర్పంచి బి.శ్రీనివాస్ శనివారం పెద్దపేటలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. సర్పంచి శ్రీనివాస్‌తో పాటు ఎలక్ట్రికల్ ఎఇ ఆర్‌వి.అప్పారావు, ఇతర అధికారులను పెద్దపేటవాసులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామంలో లో ఓల్టేజీ సమస్యతో పాటు విద్యుత్ కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. సర్పంచి శ్రీనివాస్‌తో పాటు విద్యుత్ శాఖ అధికారులకు రుణపడి ఉన్నామన్నారు. సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్నిరోజుల్లో సుమారు ఆరు కిలోమీటర్ల మేర కండక్టర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వంకాయలపాలెం, కొత్తపాలెంలో కూడా మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో అన్ని ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దుండి అశోక్‌బాబు, ఉండు శ్రీను, కోటేశ్వరరావు, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండి

కౌలు రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సిఎం జగన్ పంట సాగుదారుల హక్కు చట్టాన్ని తీసుకొచ్చారని ఉండి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. మండలంలోని వాండ్రం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు రైతులకు సాగుదారుల హక్కు చట్టం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రేవు కార్తీక్ మాట్లాడుతూ సాగుదారుడు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రాన్ని పొందాలన్నారు. పంట సాగుదారు హక్కు పత్రం ద్వారానే పంట నమోదు చేయడం గాని, పంట నష్టపరిహారం ఇవ్వడం గాని జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దాసరి వెంకటకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి సైదాడ చిన్నారావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - పాలకోడేరు

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని జనసేన ఉండి నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు విమర్శించారు. ఒకపక్క ఎండలు, మరోపక్క వడగాలుపులతో సతమతమవుతున్న ప్రజానీకానికీ ఉపశమనం కలిగించాల్సిన ప్రభుత్వం విద్యుత్ కోతలతో నరకాన్ని చూపిస్తున్నారన్నారు. విస్సాకోడేరులో అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ జనసేన మండల అధ్యక్షులు గాదం నానాజీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలతో సతమతమవుతున్న ప్రజలు అప్రకటిత విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. చిన్నారుల, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయడంతోపాటు పెంచిన ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంతోమందికి అధిక మొత్తంలో రక్త దానం చేసిన గోపిశెట్టి సత్యనారాయణ, నూకల శివను జనసేన అధ్యక్షులు నాగరాజు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - కాళ్ల


నరసాపురంటౌన్ : నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

జువ్వలపాలెం హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజు చేతులమీదుగా అవార్డులను అందించి విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మీసాల శ్రీనివాస్, మండల ఆప్షన్ సభ్యులు జార్జిబెన్హర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోపల్లె హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని స్కూల్ హెచ్‌ఎం కె.సుబ్బరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన లంకా వరలక్ష్మి, ముత్యాల రేణుక సత్యభవానిలకు ప్రశంసాపత్రం, మెడల్, రూ.మూడు వేల చొప్పున నగదు అందించారు. ద్వితీయ స్థానం సాధించిన కనకాల జెస్సికకు ప్రశంసాపత్రం, మెడల్, రూ.రెండు వేల నగదు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.వెయ్యి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎల్.భవాని, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎం.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆచంట : పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కొడమంచిలి హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు, మెడల్స్, సర్టిఫికెట్లు అందించినట్లు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. శనివారం కొడమంచిలి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ బొరుసు రాంబాబు, రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు, వైసిపి ఎస్‌సి మండల అధ్యక్షులు కొండేటి రమేష్, కన్వీనర్ టిఎన్‌డి.చంద్రశేఖర్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సాక సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : మండలంలోని పీచుపాలెం, చిన్న మామిడిపల్లి హైస్కూళ్లలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకట రమణ జయరాజు, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని బుజ్జి, కనీస వేతన ఛైర్‌పర్సన్ బర్రె లీలా శంకర్, 15వ వార్డు కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి కృష్ణమూర్తి, 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహరావు, బల్ల తాతాజీ నగదు ప్రోత్సాహకాలు అందించి సత్కరించారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో దోమల నిర్మూలనకు శనివారం యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టినట్లు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ చెప్పారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు దోమల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా రాత్రి సమయంలో ఫాగింగ్ చేస్తున్నామన్నారు. దోమలకు ఆవాసాలైన మురుగు కాలువల్లో, నీటి కుంటల్లో, బోదుల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టామన్నారు. పారిశుధ్యం మెరుగుపరచడం, మురుగు కాలువలు పరిశుభ్రపరచడంతో పాటు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ వంటి చర్యలతో పట్టణ ప్రజలకు దోమల బారి నుంచి విముక్తి కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఎన్ఆర్‌పి అగ్రహారంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

చంద్రకాంత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్‌పి అగ్రహారం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సాధారణంగా రోహిణికార్తెలోనే ఎండలు విపరీతంగా ఉంటాయని కాని రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తెలోకి ప్రవేశించి సుమారు పది రోజులు కావస్తున్నా నిత్యం 43 డిగ్రీలతో వేడి గాలులు విస్తారంగా వీస్తున్నాయన్నారు. అందరూ ఈ చలివేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు. దాత కడలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కడలి సుబ్బారావు, చంద్రకాంతమ్మ జ్ఞాపకార్థం గతంలో పది వేల మందికి డెంగీ నివారణకు మందులను ఉచితంగా పంపిణీ చేశామని, ఇప్పుడు వేసవితాపం ఎక్కువగా ఉండటంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలభా పోతురాజు, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.